

# చేబదులిచ్చిన రూపాయి



కామాక్షమ్మగారంటే మా ఇంటి పక్క వాటాలో కాపురముంటున్న రిటైర్డు రైల్వేస్టేషనుమాస్టరుగారి భార్య. వారిది ఒకప్పుడు బాగా డబ్బుండి, తరువాత చితికి పోయిన సంసారమని అంటుంటారు తెలిసిన వాళ్లు. కాని నేనెరిగిన ఈ నాలుగైదేళ్ళలో ఆమె 'చితికిపోవడ' మేమిటో ఎవ్వరికీ తెలియనివ్వకుండా, గుట్టుగా కాలక్షేపం చేస్తోంది. పిల్లజల్ల లేకపోవడంచేత, ముసలి కాలంలో కూడా ఆ దంపతులిద్దరూ ఇరుగు పొరుగు వారితో స్నేహంగా ఉంటూ చీకూ చింతా లేకుండా కాలం గడుపుతూ ఉంటారు. కామాక్షమ్మగారంటే నాకెంతో స్నేహమేకాక, గౌరవంగాకూడా ఉండేది. అందుకనే ఆవిడ నాదగ్గర చేబదులుగా పుచ్చుకున్న ఆ ఒక్క రూపాయి ఈ సంవత్సరం పొడుగునా తిరిగి ఇవ్వకపోయినా, నేనావిడని అడిగేందుకు సాహసించలేదు. అదే ఇంకొకరైతే, అలా అప్పుగా పుచ్చుకొని ఎగవేసినందుకు నేను వారి భరతం పట్టేదాన్ని. కాని కామాక్షమ్మగారి సంగతి వేరు. అసలు ఆవిడ నా రూపాయి ఎగవేసేరకం కాదనీ, కేవలం మరచిపోయిందేమోననీ నా విశ్వాసం.

మొదట్లో ఆవిడ కారోజు రూపాయ ఇచ్చిన సంగతి మరచిపోదామని నేను చాలా ప్రయత్నించాను. కాని అది అప్పట్లో సాధ్యంకాలేదు. ఆ పరిస్థితి అలాంటిది. గత సంవత్సరం సరిగ్గా ఆగస్టు నెల ఆఖరువారంలో జరిగిందీసంఘటన. మా ఆయన చేసేది లెవాసీ లాడు ఆఫీసు గుమస్తాగిరీ అవడంచేత ప్రతి నెలా ఆఖరివారంరోజులు మా గృహ పంచాంగరీత్యా పూజ్యమైన పర్వదినాలు! నెలంతా ఎంత పొదుపుగా ఖర్చుచేసినా, ఆఖరువారం బజారు వెచ్చాలకి ఇబ్బందిపడక పోవడం మా జాతకాలకి మృగ్యం. అందులో ఆగస్టునెల అంటే వరుసగా వచ్చే రెండవ ముప్పైఒక్క రోజుల నెల! మా దుర్భిక్షానికి అది అధికమాసం!

ఆ రోజు ఆమె వాళ్ల చెల్లెలిగారి ఊరి నుంచి వచ్చి రిక్షా దిగుతూనే, "సావిత్రమ్మ గారూ, ఏదీ ఒక్క రూపాయి ఉంటే ఇలా ఇవ్వండి," అన్నారు. రిక్షా అబ్బికివ్వడానికైతే నాలుగణాల డబ్బులతో సరిపోతుందే అని నాలో నేననుకున్నా. గొత్తుగా అణా, అర్ధణా అయితే ఇవ్వడం పుచ్చుకోడం కూడా మొహమాటంగానే ఉంటుందిగదా అనిపించింది. ఆవిడ దగ్గర చిల్లర నోట్లుకూడా లేవో యేమో! వెంటనే నేను మా ఆయన పర్సులో మిగిలిన ఆఖరి ఒక్క రూపాయితెచ్చి ఆవిడకిస్తూ మాట వరసకి 'చాలా?' అని కూడా అన్నాను. 'ఆఁ' అంటూ చిన్న చిరునవ్వుతో ఇంట్లోకి పోయిందావిడ. అలాటి ఆ 'రూపాయి' ఆవిడ అప్పుగా పుచ్చుకున్నదికాదని నేను ఇంకోలా ఎట్లా భావించేది?

మరో వారంరోజుల తరువాత ఓసారి ఆవిడ మా ఇంటికి వచ్చి, ఏదో లోకాభిరామాయణం మాట్లాడుతూ తన చెల్లెలిగారి ఊరిగురించి చెప్పడం ఆరంభించింది. ఆ ఊరిలో ఎండలెక్కువనీ, చలికూడా ఎక్కువగానే 'వేస్తుందట' అనీ ఏమేమో

## పంతుల సావిత్రి

చెప్తొందేకాని, నా రూపాయి సంగతే మాటాడదే! పోనీ మరచిపోయిందికాబోలు, ఏదో రోజున జ్ఞాపకంరాకపోతుందా అని మరో పక్షం రోజులు ఎదురు చూశాను. కాని నా ఊహ నిష్ఫలమైంది. నాకూ మొండి పట్టుదల కలిగింది. సభ్యతకి లోబడి 'నా రూపాయి నా కివ్వండి' అని సూటిగా అడిగే సాహసం మాత్రం చాలక, ఏదోవిధంగా ఆవిడకు జ్ఞాపకం చెయ్యడానికి ప్రయత్నాలారంభించేను. (అసలావిడ మరిచిపోయిందనేగా, నా అభిప్రాయం.)

రెండుమూడుసార్లు నేను మళ్ళీ పనికట్టుకొని ఆవిడతో వాళ్ళ చెల్లెలిగారి ఊరి విషయమై ప్రస్తావించేను. ఆ ఊళ్ళో బహుశా ధరవరలు ఎక్కువగా ఉంటాయేమోననికూడా అడిగేను. ఈ రోజుల్లో ప్రయాణాల్లో కలిగే ఇబ్బందులు, 'ఖర్చు' గురించి వ్యాఖ్యానించేను. మాటల సందర్భంలో అవకాశం కలుగ చేసుకొని, "అబ్బే రిక్షావాళ్లకి అయిపోతుందండి, బోలెడు డబ్బు," అని కూడా అనేశాను. ఆ మాటలన్నప్పుడు, 'రిక్షావాడు', 'డబ్బు' అనే మాటలను ఘట్టిగా, వత్తి పలికేనుకూడా! అయినా ఆమె నిండు విగ్రహం చలించలేదు. ఇక లాభం లేదని ఆఖరు ప్రయత్నంగా "మీ చెల్లెలిగారి ఊరు వెళ్ళి వచ్చినందుకు ఈ ప్రయాణంలో మీకు చాలా డబ్బు ఖర్చుఅయి ఉంటుందే" అన్నాను. "ఇలాంటి చిల్లరి విషయాలకి లెక్కలు పద్దులు రాయడం నా కలవాటు లేదమ్మా" అందామె చిన్నగా నవ్వుతూ. దాంతో నా నోరు బందైంది!

### చవకబేరం

ప్రసిద్ధ ఇంద్రజాలికుడు గారడీ ప్రదర్శనంలో ఒక ఖాళీ పెట్టెలో ఒక అమ్మాయిని పెట్టి మూత వేసేశాడు. కొన్ని నిమిషాల తరవాత మూత తీసి చూపించాడు. అమ్మాయి బదులు రెండు కుక్క పిల్లలు బయటికి వచ్చాయి.

ప్రదర్శనమైన తర్వాత ఒకడు ఇంద్రజాలికుని వద్దకు వెళ్లి రహస్యంగా ఇలా అన్నాడు:

"అదుగో ఆ ఎదటి సీటులో కూర్చున్న మాఆవిడని పెట్టెలో పెట్టి మాయం చేయగలరూ?"

"చెయ్యగలను. కాని మీ ఆవిడ బాధపడలేక నేనా?" అని అడిగాడు ఇంద్రజాలికుడు నవ్వుతూ.

"అంతేకాదు. మా బాబిగాడు కుక్కపిల్లలు కావాలని రోజూ ఒకటేపోరు. సరే రెండూ కలిసొస్తాయిగదా అని"

# ★ చేబదులిచ్చిన రూపాయి ★

ఆ తరువాత కూడా ప్రతీసారి మేం కలిసి నప్పుడు ఏదోవిధంగా నే నావిడతో డబ్బు మీద సంభాషణతో తప్పనిసరిగా సాగించాను. కాని ఆవిడ జ్ఞాపకశక్తి మాత్రం -ఆ ఒక్క రూపాయికి- ఎంతో అతీతంగానే ఉంటూ వచ్చింది! కాకపోతే, కొత్త పేపర్లు చదివే అలవాటున్న మనిషి. కాబట్టి కామాక్షమ్మగారు ప్రపంచ బ్యాంకు భారత రైల్వేలకు ఎన్ని కోట్ల రూపాయలు ఋణం ఇవ్వబోతున్నదో దగ్గరనుంచి వాళ్ళ ఆయన రిటైరు కాకముందు తన క్రింద పని చేసే వారికి "చిన్న చిన్న అప్పులు ఇస్తూ ఉండే వారి" మనిషీ-వాళ్ళు మాత్రం ఏదో రీతిగా ఆ పైకం ఎగవెయ్యాలని ప్రయత్నిస్తుండేవారనీ ఎంతో విపులంగా చెప్పేది.

అవన్నీ వింటూంటే నా కప్పుడప్పుడో అనుమానం కలుగుతుండేది: "ఒక వేళ ఎప్పుడైనా నేనే ఆవిడదగ్గర ఒక రూపాయి అప్పుగా పుచ్చుకొని, ఇవ్వడం మరచిపోయానా?" అని అలా తిట్టుతున్నప్పుడల్లా, నాకు నిజంగా 'ఏడుపులాటి నవ్వు' వచ్చేది. కాని పొరపాటున కాబోలు నేమోననిపిస్తూ ఉండేది కూడా!

కాకపోతే కామాక్షమ్మగారంతటి మనిషి ఒక్క రూపాయి కోసం అంత మతిమరపుగా ప్రవర్తించడ మేమిటి?

అదైనా ఏ తిరునాళ్ళలోనో, ఏ సినిమా హాలు దగ్గరో పుచ్చుకున్న చిల్లర డబ్బులైతే మరచిపోవచ్చు కాని, ప్రత్యేకం మా ఇంటి దగ్గర, నెలాఖరు రోజుల్లో నా దగ్గర ఉన్న ఒకే ఒక్క ఆఖరు రూపాయి పుచ్చుకొని మరచిపోవడం అంటే, సాక్షాత్తు ఘోరమే కాక, మన యావద్భారతదేశానికి ఎంతో నైతికపతనం కూడా!

ఒకసారి అనుకున్నాను, ఒక్క కామాక్షమ్మగారిని మినహాయించి మిగతా మా వీథిలో ఉండే నలుగురు సోదరీమణులను చేరదీసి, నా నాయకత్వాన ఒక "అఖిల భారత నైతికోద్ధరణ" సంఘం [చిల్లర అప్పులశాఖ] లాంటిదేదైనా స్థాపించేద్దామని! ఆ సంఘ సభ్యురాండ్ర (చేరితే సభ్యులకూడా) ముఖ్య బాధ్యత; తాము ఎవరెవరిదగ్గర ఒక్క రూపాయి, లేక అంతకులోపు మొత్తాలు అప్పుగాపుచ్చుకొని తీర్చకుండా మరచిపోయారో వారిపేర్లన్నీ అకారాదిక్రమంలో లిస్టుగా రాసుకొని ఉంచుకోవాల్సి ఉంటుంది..."

నా ఈ ప్రతిపాదనలనుగాని నాస్నేహితురాండ్రెవరైనా కామాక్షమ్మగారి చెవినిపడేశారా, ఆమె పరుగెత్తుకొనివచ్చి ముందుగా నా రూపాయి నాకిస్తారని నాకు బాగా తెలుసు. అయితే దయచేసి ఆవిడతో ఈ విషయాలు ముందుగా ప్రస్తావించవద్దని నా స్నేహితురాళ్లను ప్రార్థించాలనికూడా నిశ్చయించుకున్నాను.

ఇలాగ అలాగ ఆలోచించుకుంటూ ఉండగానే మరోవారం పదిరోజులు గడిచాయి. ఈ ఆలోచనలతో సతమతమవుతూ రోజువారి గృహకృత్యాల్లో చాలా పరధ్యానంగా ఉంటున్నానని మా ఆయన చాలా సార్లు హెచ్చరించేరు. (పప్పులో ఉప్పు ఎక్కువ కావటం, కాఫీలో పంచదార వెయ్యకపోవడం ఇత్యాదులకి మా ఆయన నిఘంటువులో అర్థం నాకు పుట్టింటికిపోయి మా వాళ్ళను చూసిరావాలనిఉంది అని, తదనుగుణంగా ఆయన ప్రయత్నాలారంభించి వారంరోజుల శెలవుకికూడా దరఖాస్తిచ్చి వచ్చారట!)

ఓ రోజు మధ్యాహ్నం కొత్త బద్ధకంగా పడుకొని, మూడుగంటల ప్రాంతంలో నిద్రలేచేసరికి మా పక్కవాటా కామాక్షమ్మగారింటోంచి ఏవో రాద్ధాంతాలు, సిద్ధాంతాలు వినిపిస్తున్నాయి.

ముందు గోడపక్కకిపోయి నిల్చునివిన్నాను. అవతల వీథిలోని సోదరీమణు లిద్దరూ, వారిలో ఒకరింకొకరి కిచ్చిన ఒక పావలా అప్పునుగురించి వాదులాడుకుంటున్నారు. కామాక్షమ్మగారా ఉభయుల్నీ రాజీపరచాలని సంప్రదిస్తున్నారు.

"అయినా, ఇలాంటి చిల్లర అప్పులు పుచ్చుకోనే కూడదు. పుచ్చుకున్నా, వెంటనే చెల్లించెయ్యాలమ్మడూ..." కామాక్షమ్మగారి గొంతుకతో ఈ మాటలు

## భర్తవేపు చుట్టాలు

భార్యని అస్తమానం ఏదో వేళాకోళం చేయడం భర్తకీ, భర్తకి ఛెళ్లుమని జవాబు లివ్వడం భార్యకీ అలవాటు. ఒక రోజు వీకారుకు పోయారు. రెండుగాడిద లెదురొచ్చి ఓండ్ర పెట్ట నారంభించాయి.

భర్త:—ఏమేవ్, మీచుట్టా లల్లేవుంది నిన్ను చూసి ఓండ్ర పెడ్తున్నారు."

భార్య:—అలా ఓండ్రించ కండి మరీ. పెళ్ళయ్యాకేగా వీళ్లు నాచుట్టాలైందీ!"


నేషనల్ ఇంజనీరింగ్ కంపెనీ (మద్రాసు) ప్రైవేట్ లి॥

879, నేతాజీ రోడ్, మద్రాసు-1.

మెసర్సు : స్ట్రోజెక్స్‌పోర్ట్, జెకోస్లవేకియా వారికి

దక్షిణ ఇండియా కంతటికి సోల్ ఏజెంట్లు

స్కోడా ఇంజనులు

పారిశ్రామిక, వ్యవసాయిక, నౌకా సర్వీసులకు

2,000 H. P. వరకు

జనరేటర్లు

స్టేషనరీ మరియు, పోర్టబుల్

1250 KVA వరకు

ప్రతిజిల్లా ఏజన్సీ దరఖాస్తులు కోరడమైనది.

# * లింకన్ ఛలోక్తులు *

అమెరికన్ కాంగ్రెసు ఎన్నికల ప్రచారం ముమ్మరంగా జరుగుతోంది. ఒకస్థానానికి అబ్రహాంలింకన్, పీటర్ కార్ట్‌రైట్ అనే మతప్రచారకుడు పోటీచేస్తున్నారు. ఒకరోజున కార్ట్‌రైట్ ఒక సభలో తనకే ఓట్లువెయ్యమని ప్రజలను కోరుతూ ఇలా అన్నాడు:

"అన్నివిధాలా మంచి వాడైన వ్యక్తిని కాంగ్రెసుకు ఎన్నుకొని స్వర్గానికి పోదలచుకున్న పుణ్యాత్ములు నుంచోండి."

ఒకడు తప్ప అంతా నుంచున్నారు.

"పాపాత్ముడూ, అధర్మపరుడూ అయిన వ్యక్తిని కాంగ్రెసుకు పంపించి, నరకానికి పోదలుచుకున్నవారు నుంచోండి."


ఎవ్వరూ లేవలేదు. ఇందాకా నుంచోక ఇప్పుడూ నుంచోక అలాగే కూర్చున్న వ్యక్తికేసి అంతా ఆశ్చర్యంగా చూశారు.

"నువ్వు స్వర్గానికీ వెళ్ళక, నరకానికీ వెళ్ళక ఎక్కడికి వెడదామని?" అని కార్ట్‌రైట్ అడిగాడు.

"కాంగ్రెసుకి" అని సమాధానం చెప్పి లేచిపోయాడా వ్యక్తి. అతడే అబ్రహాం లింకన్.

అమెరికా అంతర్యుద్ధ కాలంలో అధ్యక్షుడుగా ఉన్న లింకన్ పేరు చెబితే జాలిగా, గంభీరంగా, ఏదో ఆలోచనలో మునిగినట్లు చూసేవ్యక్తి జ్ఞాపకం వస్తాడు. అతడు హాస్యచతురుడనీ, ఎప్పుడూ ఏదో హాస్యకథ చెప్పి తనుకడుపుబ్బనవ్వి, ఇతరులను నవ్వించేవాడనీ చాలామందికి తెలియదు.

లింకన్ తన్ను గురించిన ఈ కథ ఎప్పుడూ చెబుతూ ఉండేవాడు:



"ఈ యుద్ధంలో జెఫర్‌సన్ డేవిస్ గెలుస్తాడని నా నమ్మకం. ఎందుకంటే జెఫర్‌సన్ ఎప్పుడూ దైవప్రార్థన చేస్తూ ఉంటాడు" అని ఒకావిడ అన్నదట. రెండో ఆవిడ "లింకన్‌కూడా దైవ ప్రార్థన చేసే మనిషే. అతడెందుకు గెలవకూడదు?" అని అడిగిందట. "లింకన్ తమాషాకి ప్రార్థన చేస్తున్నాడని దేవుడనుకుంటాడు, అందుకని," అని మొదటావిడ అన్నదట.

అధ్యక్షపదవికి లింకన్‌తో పోటీచేసిన డగ్లస్ ఒకసారి లింకన్‌ను "Two Faced man'' (రెండుముఖాల మనిషి) అని ఒక సభలో ఆక్షేపించాడట. లింకన్ సభకేసి తిరిగి "సభికులారా! నాకే రెండు మొహాలుంటే ఈ మొహం ఎందుకుంచుకుంటాను చెప్పండి," అన్నాడట.

ఇక కొద్దికాలానికి చనిపోతాడనగా లింకన్‌కి ఒక కలవచ్చిందట. తను ఉండే "వైట్‌హౌస్'' లోనే గొల్లున ఏడ్పులు వినిపించినట్టు, "ఏం ఎవరు పోయారు?" అని రక్షక భటులను అడిగితే "అధ్యక్షుడు పోయాడు. ఆయన్నెవరో హత్యచేశారు" అని వారు సమాధానం చెప్పినట్టు కలవచ్చింది.

లింకన్ భార్య ఈ కల విని చాలా విచారపడింది. ఆమెకు ధైర్యం చెప్పడానికి లింకన్ ఛలోక్తిగా "అబ్బే నేను కాదు కలలో చచ్చిపోయింది, అధ్యక్షుడట." అన్నాడు.

లింకన్ హాస్యోక్తులలో ఇదే ఆఖరుది. ఆతరవాత కొన్నాళ్ళకే ఆకల నిజమై ఊరుకుంది. ★

---

వినగానే చెప్పొద్దూ నాకు అరికాలిమంట నెత్తికెక్కింది.

ఈ రోజు ఆవిడ కెలాగైనా పాఠం చెప్పాలని నిశ్చయించుకొని, నేనూ అక్కడికి బయల్దేరేను.

నన్ను చిరునవ్వుతో పలకరించి ఆహ్వానించేనే ఆవిడ! "అయినా, ఇందులో నీ దోషం కూడా ఉందమ్మాయి. ఒకవేళ నీ దగ్గర పావలా పుచ్చుకున్న విషయం ఆవిడ మరచి పోయిందనే అనుకో. ఒకసారి జ్ఞాపకం చేసి ముఖతః అడిగి తీసుకోవాల్సిందే కాని, ఇన్నాళ్ళూ ఊరుకొని ఇప్పుడీవిధంగా సాధించడం తగదు సుమా!" అంది ఆ రెండో ఆవిడ్ని సంబోధిస్తూ.

దాంతో నా ఉత్సాహం కొంపలేచరు మళ్ళీ నార్మలు కొచ్చింది. ఈవిడ్ని మరి సాధించలేనేమోరా, భగవంతుడా అని విచారించాను.

పోనీ మరో విధంగా ప్రయత్నించి ఆవిడతో: "ఇదిగో, కామాక్షమ్మగారూ! ఫలానా రోజున మీరు మీ చెల్లెలిగారి ఊరినుంచి వచ్చి రిక్షా దిగుతుండగానే, అవసరమై మీ దగ్గర ఒక రూపాయి పుచ్చుకున్నాను," అని నేనే ఆవిడకింకో రూపాయి ఇవ్వ జూపితే?

ఇది కాస్త ఘటి మాతాదే కావచ్చు. దీంతో ఆవిడ సిగ్గుతో చచ్చినంత పనిఅయి, పశ్చాత్తప్త హృదయంతో క్షమాపణ కోరుకుంటూ నా రూపాయి నాకు తిరిగి ఇవ్వవచ్చు.

కాని ఆవిడముఖం చూస్తే నాకు, ఆ నమ్మకం కూడా సడలిపోయింది. తీరా ఆవిడ చిన్నగా నవ్వుతూ: "సరేలే, అమ్మా, దానికేముందిలే" అంటూ ఆ రెండో రూపాయి కూడా తీసుకుంటేనో! పోయిన రూపాయికోసం ఇంకో రూపాయి కూడా పందెం కాచి జూదం ఆడినట్టే!

ఆవిడ 'మరచిపోయిన ఒక్క రూపాయి' వసూలు చేసే కార్యక్రమంలో, నా ప్రణాళికకి అక్కడో పెద్ద ఫుల్‌స్టాపు పెట్టాను! ఆ విషయం 'మరచిపోవాలి. మరచిపోవాలి' అని రోజూ వందసార్లన్నా మననం చేసుకుంటుంటాను.

మరచిపోదామనుకున్న నా నిర్ణయం పొరపాటుగా మరచిపోతానేమోనని జ్ఞాపకంగా నా చీరకొంగు ముడివేసుకొని, మాటిమాటికీ చూసుకుంటుంటాను కూడా! ★